క్లుప్తంగా

పారిశుధ్య కార్మికులకు పీపీ కిట్ల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు పీపీ కిట్లు అందజేస్తున్న చైర్మన్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

ముమ్మిడివరం: నగర పంచాయతీలోని పారిశుధ్య కార్మికులకు పీపీ కిట్లు పంపిణీ చేశారు. కమిషనర్ రవివర్మ ఆధ్వర్యంలో జరిగిన నమస్తే ప్రోగ్రామ్ కార్యక్రమంలో చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ పాల్గొని వీటిని అందజేశారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆర్థిక సాయంతో వీటిని సమకూర్చారని ఆరోగ్య భద్రత కోసం ఈ కిట్లను కార్మికులు విధిగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ జి.సత్యనారాయణరాజు, టీపీఓ రాజేష్‌బాబు, శానిటరీ సెక్రటరీలు, పారిశుధ్య కార్మికులు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహిద్దాం



దివ్యాంగులను సత్కరిస్తున్న చైర్మన్ కమిడి ప్రవీణ్ తదితరులు

ముమ్మిడివరం: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నగర పంచాయతీలో దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 20వ వార్డులో గల దివ్యాంగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులకు సమాజంలో సమాన హక్కులు, సముచిత స్థానం కల్పించాలన్నారు. దివ్యాంగులను ఘనంగా సత్కరించారు. కమిషనర్ పి.రవివర్మ, మెప్మా సీఎంఎం సోమాని భాస్కర్, సీఓ రాజేశ్వరి, ఆర్పీలు, విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.

షష్ఠి మహోత్సవానికి రాట ముహూర్తం



కనకాలపేటలో షష్ఠి మహోత్సవానికి రాట ముహూర్తం పూజలు

యానాం: పట్టణ పరిధిలోని కనకాలపేటలో కొలువైన లక్ష్మీ గణపతి, వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవాలను పురస్కరించుకుని బుధవారం రాట ముహూర్తాన్ని ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ కోనంభట్ల శ్రీరామచంద్రమూర్తి శర్మ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలను కమిటీ సభ్యులు వివరించారు. ఈ నెల 6న మూల విరాట్‌లకు పంచామృతాభిషేకాలు, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, 7న పుష్పాలంకరణ, భజన తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ పూజా కార్యక్రమాలకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ దంపతులు హాజరవుతారన్నారు.

విద్యా పురోగతిపై సర్వే

యానాం: విద్యార్థుల సమగ్రాభివృద్ధికి సంబంధించి 3, 6, 9 తరగతులకు బుధవారం యానాం నియోజకవర్గ పరిధిలో వివిధ ప్రభుత్వ,ప్రైవేట్ స్కూల్స్‌లో రాష్ట్రీయ సర్వేక్షణ్–2024 సర్వేను నిర్వహించినట్లు ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్ ఓ ప్రకటనలో తెలిపారు. 1028 మంది విద్యార్థులు ఈ సర్వేకు హాజరైనట్లు పేర్కొన్నారు. ఫీల్డ్ ఇన్విజిలేటర్లు డాక్టర్ ఎస్ఆర్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జవహర్ నవోదయ విద్యాలయ నుంచి వచ్చినట్లు తెలిపారు. సీబీఎస్ఈ సెల్ న్యూఢిల్లీ నుంచి స్పెషల్ అబ్జర్వర్‌గా అజిత్‌కుమార్ హాజరై సర్వేకు సంబంధించిన ఏర్పాట్లు చేశారన్నారు. జేఎన్వీ ప్రిన్సిపాల్ రాజశేఖర్ రెడ్డి, హెచ్ఎం నళినికుమారి, టీజీటీ వెంకటకృష్ణ, రీజినల్ లెవెల్ మాస్టర్ ట్రైనర్స్‌గా సర్వేలో పాల్గొన్నారన్నారు.

పశువుల సంచారంతో ప్రమాదాలు



ఆర్‌ఓటీ కార్యాలయం ఎదుట రహదారిపై తిష్ట వేసిన పశువులు

యానాం: పట్టణ పరిధిలో రహదారులపై పశువులు యథేచ్ఛగా తిరుగుతుండటంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని బుధవారం స్థానికులు, పలువురు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువులను తమకు సంబంధం లేనట్లు యజమానులు రోడ్లపై వదిలేస్తున్నారని ఆరోపించారు. దీంతో వాహన చోదకులు, పాదచారులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. ఈ సమస్యపై ఇప్పటికే మున్సిపాలిటీ యంత్రాంగానికి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. తక్షణం పశువులను దూర ప్రాంతాలకు తరలించాలని వారు కోరారు.

వెచ్చని నేస్తాలు

- పెరిగిన ఉన్ని దుస్తుల విక్రయాలు
- ఆకర్షణీయమైన డిజైన్లతో లభ్యం
- ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి విక్రయాలు చేస్తున్న వ్యాపారులు
- తక్కువ ధరకే లభ్యం కావడంతో వినియోగదారుల ఆసక్తి

తాళ్లరేవు: చలిపులి పంజా విసురుతోంది. అసలే శీతాకాలం దీనికితోడు గత నాలుగు రోజులుగా తుపాను ప్రభావంతో చలి తీవ్రత మరింత పెరిగింది. సాయంత్రం ఆరు గంటల నుంచే చలి గాలులు వీస్తూ గజగజ వణికిస్తున్నాయి. కోస్తా ప్రాంతం సముద్ర తీరం వెంబడి ఉండడంతో పాటు మడ అడవులు అధికంగా ఉండడంతో స్వతహాగానే ఇక్కడ చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీంతో చలి బారి నుంచి కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ఉన్ని దుస్తులను వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్వెట్టర్లు, జర్కిన్లు, హుడీలు, మంకీ క్యాప్‌లు, గ్లోవ్‌లను ప్రజలు ఆశ్రయిస్తున్నారు. అయితే పట్టణాలకు వెళ్లి ఉన్ని దుస్తులను దుకాణాల్లో కొనాలంటే భారీ ఖర్చుతో కూడుకున్న పని. ఈ నేపథ్యంలో మీకు మేము అండగా ఉన్నామంటూ ఎక్కడ నుంచో వచ్చిన వెచ్చని అతిథులు ప్రధాన రహదారుల కూడళ్లలో దర్శనమిస్తూ రంగు రంగుల ఉన్ని వస్త్రాలతో స్వాగతం పలుకుతున్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల నుంచి ఇక్కడకు వచ్చి గుడారాలను వేసుకుని ఉన్ని వస్తువుల విక్రయాలు సాగిస్తున్నారు. దాదాపుగా శీతాకాలం ప్రారంభమైనప్పటి నుంచి సంక్రాంతి పండగ వరకు ఉన్ని వస్తువులను విక్రయిస్తుంటారు. సుమారు మూడు నెలల పాటు వ్యాపారాలు సాగించేందుకు దూర ప్రాంతాల నుంచి ఏటా మన ప్రాంతానికి రావడం విశేషం. భాష పూర్తిగా రాకపోయినా ఇక్కడి వారి హావ భావాలను అర్థం చేసుకుంటూ వ్యాపారం సాగించడం వారి సొంతం.

జోరుగా కొనుగోళ్లు

ఇటీవల చలి ప్రభావం పెరగడంతో ప్రజలు ఉన్ని దుస్తులను ఆశ్రయిస్తున్నారు. నియోజకవర్గంలోని ముమ్మిడివరం, మురమళ్ల, సుంకరపాలెంలోని ప్రధాన కూడళ్లలో రహదారుల వెంబడి తాత్కాలిక దుకాణాలను ఏర్పాటు చేసి విక్రయాలు చేపడుతున్నారు. వివిధ రకాల డిజైన్లలో స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు, శాలువాలు, రెయిన్ కోట్లు అమ్మకాలు సాగిస్తున్నారు. రంగు రంగుల డిజైన్లలో తక్కువ ధరలకే లభిస్తుండడంతో వీటిని కొనుగోలు చేసేందుకు జనం ఎగబడుతున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు విక్రయాలు సాగిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి అమ్మకాల కోసం వచ్చిన వ్యాపారులు ఇక్కడి ప్రజలతో మమేకమై వ్యాపారాలు సాగిస్తున్నారు. రూ.50 నుంచి రూ.1500 వరకు వరకు ఉన్ని వస్తువులు అందుబాటులో ఉంటున్నాయి. పిల్లల స్వెట్టర్లు రూ. 200 నుంచి రూ.500 వరకు, పెద్దలకు రూ.400 నుంచి రూ.1000 వరకు, రెయిన్ కోట్‌లు రూ.500 నుంచి రూ.1500 వరకు, శాలువాలు రూ.200 నుంచి రూ.500, స్కార్ఫ్‌లు రూ.40 నుంచి రూ.200 వరకు మఫ్లర్‌లు, మంకీ క్యాప్‌లు, గ్లౌజ్‌లు రూ.100 నుంచి అందుబాటులో ఉన్నాయి.



యానాం-ఆంధ్రా సరిహద్దు సుంకరపాలెం జంక్షన్‌లో జోరుగా సాగుతున్న ఉన్ని వస్త్రాల విక్రయాలు



ముమ్మిడివరంలో రహదారి చెంత ఉన్ని వస్త్రాలతో కళకళలాడుతున్న దుకాణం

ఆత్మీయతను మరువలేం

గత పదేళ్లుగా ఈ ప్రాంతంలో ఉన్ని వస్త్రాలను విక్రయిస్తున్నాం. ఇక్కడి ప్రజల ఆత్మీయతను ఎప్పటికీ మరువలేము. ఏటా నవంబరు నెలాఖరులో ఇక్కడకు వచ్చి ఉన్ని వస్త్రాలను విక్రయిస్తుంటాం. అందరికీ అందుబాటులో ఉండే ధరల్లో విక్రయాలు చేపడుతున్నాం. దీంతో ఎక్కువ మంది వినియోగదారులు వచ్చి కొనుగోళ్లు చేస్తుంటారు. ఇక్కడి ప్రజలు మమ్మల్ని ఎంతగానో ఆదరిస్తూ సహకారం అందిస్తుంటారు. సుమారు మూడు నెలలపాటు వ్యాపారాలు చేసి సంక్రాంతి పండగకు మా ప్రాంతాలకు చేరుకుంటాం.

రాజేష్ రాయ్, వ్యాపారి, మధ్యప్రదేశ్.

అమర గాయకుడు ఘంటసాల



అమలాపురంలో ఘంటసాల చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సంఘ సభ్యులు



తాళ్లరేవులో ఘంటసాల పాటలను ఆలపిస్తున్న కళాకారుడు చిరంజీవి

అమలాపురం టౌన్: జిల్లా దుర్గా మల్లేశ్వరస్వామి కార్పెంటర్, చేతి వృత్తుల సంక్షేమ సంఘం కార్యాలయంలో గాన గాంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతిని బుధవారం నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి, సంఘ సభ్యులు ఘంటసాల చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ఘంటసాల అమర గాయకుడే కాక తెలుగు కళామతల్లి ముద్దుబిడ్డని కొనియాడారు. ఘంటసాలకు భారతరత్న ప్రకటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, సంఘ ప్రతినిధులు కొనుకు వెంకటేశ్వరరావు, పితాని బేబీరావు, కుసుమే నరసింహరాజు, సాధనాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల గానం అజరామరం

తాళ్లరేవు: గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు గానం ప్రజలకు అమృత భాండాగారమని పలువురు వక్తలు కొనియాడారు. బుధవారం ఘంటసాల జయంతిని తాళ్లరేవు ప్రజా సంఘాల భవనంలో ఘనంగా నిర్వహించారు. పూలే, అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ప్రతినిధి గుత్తుల మల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడుతూ ఘంటసాల పేదరికంలో జన్మించినా సంగీతం నేర్చుకోవాలనే పట్టుదలతో విజయనగరం సంగీత కళాశాలలో చేరారన్నారు. పూటకూళ్ల భోజనం చేస్తూ సంగీత సాధన చేసి విద్వాంసుడుగా మారి తెలుగు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ఈ సందర్భంగా తాళ్లరేవు భజన మండలి తరపున వాకపల్లి చిరంజీవి, పి.హేమసుందర రావు, వల్లు సత్తిబాబులు ఘంటసాల పాటలు పాడి అలరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



అమలాపురం సర్వశిక్ష అభియాన్ భవనంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రం



అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్నికల సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు



అల్లవరంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ మాధవీలత

- నియోజకవర్గంలో మూడు పోలింగ్ కేంద్రాలు
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 735 మంది ఓటర్లు
- నేడు పోలింగ్ నిర్వహణ

అమలాపురం టౌన్: అమలాపురం నియోజకవర్గంలో ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ఎన్నికలకు డిస్ట్రిబ్యూటరీ కేంద్రంగా ఎంపిక చేసిన అమలాపురంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నుంచి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బంది పోలింగ్ మెటీరియల్‌ను తీసుకుని ఆయా కేంద్రాలకు బుధవారం తరలివెళ్లారు. నియోజకవర్గంలో అమలాపురం పట్టణం, అల్లవరం, ఉప్పలగుప్తం మండల కేంద్రాల్లో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అమలాపురం పట్టణంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉన్న సర్వశిక్షా అభియాన్ భవనం, అల్లవరంలో మండల పరిషత్ కార్యాలయ భవనం, ఉప్పలగుప్తం మండల పరిషత్ కార్యాలయ భవనంలో పోలింగ్ కేంద్రాలను నెలకొల్పారు. ఈ మూడు పోలింగ్ కేంద్రాల్లో 443 మంది పురుషులు, 292 మంది మహిళలు మొత్తం 735 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. జిల్లా మొత్తం మీద అమలాపురం పోలింగ్ కేంద్రంలోనే అత్యధికంగా 606 మంది ఓటర్లు ఉన్నారు. ఈ పోలింగ్ కేంద్రాలను బుధవారం పలు శాఖల అధికారులు పరిశీలించారు. గురువారం నిర్వహించే పోలింగ్‌కు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

అల్లవరం: ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించడానికి అల్లవరం హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీఓ మాధవీలత బుధవారం పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ అమలాపురం డివిజన్ పరిధిలో పది పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ సాగుతుందన్నారు. అనంతరం పోలింగ్ బాక్సులను కౌంటింగ్ కేంద్రానికి తరలిస్తామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావు, డీటీ సుబ్రహ్మణ్యం, పోలింగ్ అధికారి మురళి, ఏపీఓ గిరిబాబు తదితరులు ఉన్నారు.

తాళ్లరేవు: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండల కేంద్రమైన తాళ్లరేవు మండల పరిషత్ కార్యాలయంలోని వీసీ హాల్‌లో పోలింగ్ స్టేషన్ నెంబర్ 43ను పోలింగ్‌కు సిద్ధం చేశారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. పోలింగ్ అధికారులు ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటున్నట్లు ఎంపీడీఓ కె.సత్యన్నారాయణ తెలిపారు. తాళ్లరేవు మండలంలో 83 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

అలరించిన గీతాలాపన



సంగీత విభావరిలో గీతాలు ఆలపిస్తున్న గాయకులు

అమలాపురం టౌన్: అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు పాడిన ఆపాత మధుర గీతాల సంగీత విభావరి స్థానిక వాసవీ కల్యాణ మండపంలో బుధవారం రాత్రి వీనుల విందుగా సాగింది. పట్టణానికి చెందిన విశ్రాంత మున్సిపల్ ఉద్యోగి, ఘంటసాల పాటల గాయకుడు పళ్ల త్రినాథ్ ఆధ్వర్యంలో 14 మంది గాయకులతో ఈ సంగీత విభావరి జరిగింది. ఘంటసాల పాడిన పలు పాత చిత్రాల్లోని పాటలను గాయకులు పాడి ఆహూతులను రంజింప జేశారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఈ సంగీత విభావరి ఏర్పాటైంది. ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు నంబూరి సత్యనారాయమూర్తి, స్థానిక పొట్టి శ్రీరాములు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వ్యాపార సంఘం అధ్యక్షుడు జనిపిరెడ్డి సురేష్ తదితరులు పాల్గొన్నారు. అమలాపురం పట్టణంలో ఘంటసాల విగ్రహ కమిటీ ఏర్పాటై ఆ కమిటీ ఆధ్వర్యంలో అమర గాయకుడి విగ్రహం ఆవిష్కృతమైంది.

ముగిసిన అయ్యప్ప మాలధారుల భిక్ష

తాళ్లరేవు: సుంకరపాలెం గ్రామంలో ధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయంలో దాతల సహకారంతో 54 రోజుల పాటు అయ్యప్ప భక్తులకు ఏర్పాటు చేసిన భిక్షా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. గురుస్వాముల పర్యవేక్షణలో చివరి రోజున మాగాపు శ్రీనివాసరావు, వీరవేణి దంపతులు, కుటుంబ సభ్యుల సహకారంతో సుమారు 500 మంది స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. అయ్యప్ప స్వాముల సౌకర్యార్థం ఏటా దాతల సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి విశేష స్పందన వస్తుందని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

అక్రమార్కులకు అడ్డేలేదు..!

- అడ్డగోలుగా ర్యాంపుల్లో ఇసుక విక్రయాలు
- పట్టించుకోని అధికారులు



అనుమతులు లేకుండా తాళ్లరేవు ర్యాంపులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న దృశ్యం

తాళ్లరేవు: ప్రభుత్వ అనుమతులు లేకుండా మండలంలోని పలు గ్రామాల్లో అక్రమ ఇసుక విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మండల కేంద్రమైన తాళ్లరేవుతో పాటు కోరంగి పంచాయతీ సీతారామపురం గ్రామ పరిధిలోని ర్యాంపుల్లో అక్రమార్కులు ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కూటమి నేతల కనుసన్నల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. బుధవారం ఆయా ర్యాంపుల్లో అనేక ట్రాక్టర్లలో ఇసుకను తరలించారు. మండల పరిధిలో అనేక కుటుంబాలు ఇసుక తవ్వకం, రవాణాపై ఆధారపడి జీవిస్తున్నాయి. దీనిని సాకుగా చూపి కూటమి నాయకులు యథేచ్ఛగా ఇసుకను తవ్వి తరలిస్తున్నారు. కష్టపడి పనిచేసే కార్మికులు, రవాణా చేసే వాహనాలకు నామమాత్రంగా సొమ్ము చెల్లించి దళారులు మాత్రం జేబులు నింపుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు ఇసుక అక్రమ తవ్వకాలపై దృష్టి సారించి బాధ్యులపై చర్యలు చేపట్టాలని సర్వత్రా కోరుతున్నారు.

రీజెన్సీ ఫ్యాక్టరీ పునఃప్రారంభానికి సన్నాహాలు

ఎమ్మెల్యే అశోక్‌తో ఫ్యాక్టరీ ఎండీ జీఎన్ నాయుడు భేటీ



రీజెన్సీ ఫ్యాక్టరీ అధినేత నాయుడుతో ఎమ్మెల్యే అశోక్ చర్చలు

యానాం: వివిధ కారణాలతో పన్నెండేళ్లుగా యానాంలో మూతపడ్డ రీజెన్సీ భారీ సిరామిక్స్ ఫ్యాక్టరీని పునః ప్రారంభించి వేలాది మంది యానాం నిరుద్యోగులకు ఉపాధి కల్పించే దిశగా సన్నాహాలు చేస్తున్నట్లు రీజెన్సీ సిరామిక్స్ ఫ్యాక్టరీ ఎండీ డాక్టర్ జీఎన్ నాయుడు తెలిపారు. బుధవారం దొమ్మేటిపేటలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆయనను కలిసి రీజెన్సీ పునః ప్రారంభంపై చర్చించారు. ఈ సందర్భంగా జీఎన్ నాయుడు మాట్లాడుతూ ప్రజలకు మంచి జరిగితే ఓర్వలేని తనంతో అడ్డంకులు సృష్టిస్తున్న వ్యక్తి గురించి త్వరలోనే ప్రజల ముందు బహిరంగంగా తెలియ జేస్తానన్నారు. ఫ్యాక్టరీ మరమ్మతులకు రూ.25 కోట్ల మేర పెట్టుబడులు పెట్టి ప్రారంభించేందుకు ఎదురు చూస్తున్నామన్నారు. ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిని పక్కదోవ పట్టిస్తూ యానాం అభివృద్ధి, సంక్షేమాన్ని అడ్డుకుంటున్న వ్యక్తి ఎవరో అందరికీ తెలుసునని త్వరలో అతనికి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. రీజెన్సీ తెరిపించేలా అన్ని విధాలా సహకారం అందిస్తానన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



ఏసుబాబు మృతదేహం

అల్లవరం: దుస్తులను శుభ్రం చేసుకోవడానికి చెరువుకి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తూ దానిలో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. బోడసకుర్రు గ్రామానికి చెందిన పెదపూడి ఏసుబాబు (48) ఈ నెల ఒకటిన గ్రామంలోని నాగమల్లి చెట్టు వద్ద ఉన్న చెరువులో దుస్తులు ఉతుక్కోవడానికి వెళ్లాడు. ఆ క్రమంలో ప్రమాదవశాత్తూ చెరువులో పడి మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదుపై ఎస్సై కృష్ణారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన



దెబ్బతిన్న పంటపై డ్రోన్‌తో ఉప్పు ద్రావణం పిచికారీ చేస్తున్న దృశ్యం

ఉప్పలగుప్తం: ఫెంగల్ తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురవడంతో దెబ్బతిన్న వరిపంట మొలక రాకుండా ఉండేందుకు డ్రోన్ సహాయంతో ఉప్పు ద్రావణాన్ని బుధవారం ప్రయోగాత్మకంగా స్ప్రే చేశారు. ఉప్పలగుప్తం మండలం పెదగాడవిల్లి గ్రామంలో భారీ వర్షాలకు పడిపోయిన వరి చేలను జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు పరిశీలించారు. వర్షానికి తడిసిన ధాన్యం మొలక రాకుండా 5 శాతం ఉప్పు ద్రావణాన్ని డ్రోన్ సహాయంతో స్ప్రే చేయించారు. రైతులంతా ఈ విధానాన్ని అనుసరించడం వల్ల సమయం, ఖర్చు ఆదా అవుతుందని జేడీ తెలిపారు. డ్రోన్ వినియోగంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ నందకిషోర్, జిల్లా వనరుల వ్యవసాయాధికారి మనోహర కృష్ణ, ఏఓ కుమార్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మృతి

అల్లవరం: గోడిలంక పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వృద్ధురాలు బుధవారం గోడిలంక బస్టాండ్ ఆవరణలో మృతి చెందింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై ఏఎస్సై కృష్ణారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

హిందువులపై దాడులు అమానుషం



మానవహారం నిర్వహిస్తున్న వీహెచ్‌పీ, భజరంగదళ్, పలు పార్టీల ప్రతినిధులు

అమలాపురం టౌన్: బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులు, మారణ కాండలు అమానుష చర్యలని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ), భజరంగ దళ్ నాయకులు ముక్త కంఠంతో నినదించారు. స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఈ రెండు సంస్థల ప్రతినిధులు, కార్యకర్తలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు బుధవారం సాయంత్రం నిరసన ప్రదర్శన నిర్వహించారు. మానవహారం నిర్వహించి బంగ్లాదేశ్‌లో దాడులను తక్షణమే ఆపాలని నినాదాలు చేశారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో రాజమహేంద్రవరం వీహెచ్‌పీ నాయకుడు ఓలేటి సత్యనారాయణ, భజరంగదళ్ రాష్ట్ర సహాయ ప్రముఖ్ శిరంగు నాయుడు, వీహెచ్‌పీ రాష్ట్ర నాయకుడు బులుసు జగదీష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, వైఎస్సార్ సీపీ నాయకుడు బొక్కా ఆదినారాయణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ, జనసేన నాయకుడు యేడిద శ్రీను తదితరులు బంగ్లాదేశ్ దాడులను ఖండించారు. రాజమహేంద్రవరం ఇస్కాన్ ప్రతినిధి సుందరదాస్ నమయి మాట్లాడుతూ సనాతన ధర్మంతో ముందుకు సాగే హిందువులను మట్టు పెట్టాలనుకుంటున్న బంగ్లాదేశ్ భవిష్యత్‌లో రెట్టింపు ఇబ్బందులను ఎదుర్కోక తప్పదన్నారు. అనంతరం వారు ప్రదర్శనగా కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్ మహేష్‌కుమార్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు.

పశు గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం



ఈదరపల్లిలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఉప సంచాలకుడు మూర్తి

అమలాపురం రూరల్: రాష్ట్రీయ గోకుల్ మిషన్, కాకినాడ పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈదరపల్లి గ్రామంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం నిర్వహించారు. బుధవారం ఈ శిబిరాన్ని జిల్లా ఉప సంచాలకుడు డాక్టర్ కర్నీడి మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి ఒకటి చొప్పున జిల్లాలో 22 శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ఎదకురాని, గర్భం దాల్చిన పశువులను గుర్తించి తగిన వైద్యం అందించడం జరుగుతుందన్నారు. రైతులు శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. 70 పశువులకు చికిత్స, 20 ఆడ దూడలకు బ్రూసెల్లా టీకాలు వేసినట్లు అమలాపురం సహాయ సంచాలకులు ఎల్.విజయారెడ్డి తెలిపారు. పశుగణాభివృద్ధి సంస్థ వైద్యురాలు కల్యాణి, వైద్యులు మాధురి, నారాయణరావు, వాసవి పాల్గొన్నారు.